క్లుప్తంగా

బకాయిలు చెల్లించాలని డిమాండ్



మాట్లాడుతున్న కిరణ్

ఎటపాక: గిరిజనులకు ఉపాధి కల్పించే తుని కాకు సేకరణకు టెండర్ల ప్రక్రియ చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గుండాలకాలనీలో నేత సోందె రామారావు అధ్యక్షతన ఆదివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తునికాకు సేకరణ కోసం ప్రూనింగ్ పనులు వెంటనే చేపట్టాలన్నారు. తూనికాకు సేకరణలో కార్మికులకు చెల్లించాల్సిన బకాయి బోనస్‌ను అందజేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో ప్రూనింగ్ పనులు చేపట్టకపోతే గిరిజనులకు ఆదాయ వనరులు తగ్గుతాయని, ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు ఎం.నాగేశ్వరరావు, ఐ.వి, అర్జున్, బాలకృష్ణ, హరి, రత్తమ్మ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మజ్జి చంద్రుబాబు

పెదబయలు: మండలంలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని మండల పార్టీ అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు అన్నారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్షుడిగా తనకు అవకాశం కల్పించినందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్రకు అభినందనలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, అహర్నిశలు పార్టీ కోసం పని చేస్తానన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అందరి సూచనలు, సలహాలు తీసుకొని గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

ప్రశాంతంగా ముగిసిన హిందీ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎటపాక: దక్షిణ భారత హిందీ ప్రచార సభ లోయర్, హయ్యర్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి.మండలంలోని సీతాపురం, గౌరీదేవిపేట, నెల్లిపాకలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు ఈ పరీక్షలను గౌరిదేవిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాశారు.

సైబర్ నేరాలపై అవగాహన



స్థానికులతో మాట్లాడుతున్న ఎస్ఐ చినబాబు

రాజవొమ్మంగి: లోతట్టు గ్రామం వాతంగిలో జడ్డంగి ఎస్ఐ చినబాబు శనివారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, సారా తయారీ, అమ్మకాలకు దూరంగా ఉండాలన్నారు. యువత ఉన్నత విద్యపై దృష్టి సారించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. పిల్లలు, వృద్ధులకు స్నాక్, యువకులకు వాలీబాల్ కిట్‌లు అందజేశారు.

రైతుల వివరాలు నమోదు

కొయ్యూరు: బినామీ రైతులకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం రైతు ప్రత్యేక నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఏవో ఉమాదేవి చెప్పారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పథకాలు సక్రమంగా రైతులకు అందడం లేనట్టు గుర్తించిన కేంద్రం రైతు వివరాల నమోదుపై దృష్టి సారించిందన్నారు. ఇందులో భాగంగా రైతుల పట్టాతో అనుసంధానమైన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుందని, దీని ఆధారంగా ప్రతి రైతుకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నంబర్ కేటాయిస్తారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ అయిన రైతుకు పథకాలు వర్తిస్తాయన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



శ్రీలతకు నగదు అందజేస్తున్న నేతలు

వై.రామవరం(అడ్డతీగల): లివర్ సంబంధిత సమస్యతో అనారోగ్యంతో బాధపడుతున్న ఎర్రగొండ నివాసి శ్రీలత వైద్యం కోసం రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, ఆమె భర్త విజయ భాస్కర్ సాయమందించారు. ఈ మేరకు మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్, నాయకులు వారు కేటాయించిన రూ.50వేలను బాధితురాలు శ్రీలతకు ఆదివారం అందజేశారు. వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లేందుకు అంబులెన్స్‌ను ఏర్పాటుచేసినట్టు నాయకుల తెలిపారు.

పక్కా ప్రణాళిక.. విజయ సూచిక



ప్రతి విద్యార్థికి టెన్త్ కీలకం. భవిష్యత్తు బంగారుబాటలో నడవాలంటే పదో తరగతిలో విద్యార్థి ప్రతిభ నిరూపించుకోవాల్సిందే. ఇష్టపడి ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించవచ్చని నిపుణులు చెబుతున్నారు. 'పది' పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు స్పెషల్ క్లాసులతో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. పాఠశాలల్లో వంద రోజుల ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తున్నారు.

- టెన్త్ విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- కేటగిరీలుగా విభజన
- ఉత్తమ ఫలితాలపై ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ

ప్రత్యేక తరగతులు



పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులు పట్టు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు చదివిన అంశాలు గుర్తుండేలా వారికి డైలీ, వీక్లీ, మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని గుర్తించి వెనుకబడిన వారిపై మరింత ప్రత్యేక దృష్టి సారించేందుకు అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రత్యేక ప్రణాళిక ద్వారా వారంలో అన్ని సబ్జెక్టుల పరీక్షలు రాసేలా చూస్తున్నారు. ఉదయం రెండు గంటలు.. సాయంత్రం రెండు నుంచి మూడు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో కలిగే లాభాలను విద్యార్థులకు వివరిస్తూ ఉత్సాహాన్ని నింపుతున్నారు.



మాక్ టెస్ట్‌లు రాస్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమైన దశ. విద్యార్థి 'పది'లో సాధించిన మార్కులు భవిష్యత్తును నిర్ణయించేందుకు ఉపయోగపడతాయి. ఇందులో భాగంగా ఉత్తమ మార్కులు సాధించేలా ప్రతి విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రులు ఆశిస్తారు.. ప్రత్యేక ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయులు, మేధావులు, నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు పదో తరగతిలో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు పొందేందుకు అల్లూరి జిల్లాలోని 22 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే పక్కా ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నారు.

విద్యార్థులు చదువులో వారి సామర్థ్యం మేరకు వెనుకబడిన, మధ్యస్థ, మెరుగైన కేటగిరీలుగా విభజించి పరీక్షల సమయానికి అందరూ సమాన స్థాయికి చేరేలా ప్రత్యేక బోధనను అందిస్తున్నారు.

పరీక్షల ఒత్తిడి దూరం చేసేందుకు చర్యలు

విద్యార్థులు మొట్టమొదటి పబ్లిక్ పరీక్షలను ఎదుర్కొంటున్న సమయంలో కాస్త భయంతో ఒత్తిడికి లోనయ్యే ఆస్కారం అధికంగా ఉండడం సహజం. దీంతో విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షల భయం పోగొట్టేలా మానసిక స్థైర్యం కల్పిస్తున్నారు. ఇందుకు అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులను ఏ,బీ,సీ,డీ బృందాలుగా విభజించారు. విద్యార్థుల హాజరు, చదివిన, చదువుతున్న అంశాలను పరిశీలిస్తూ, వారు మరింత బాగా మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అల్లూరి జిల్లా వ్యాప్తంగా 272 పాఠశాలల నుంచి 12,492 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్టు అధికారులు తెలిపారు.



రాత్రి పూట ప్రత్యేక తరగతులు



ప్రత్యేక తరగతిలో పదో తరగతి విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో టెన్త్ పరీక్ష రాయనున్న విద్యార్థుల వివరాలు

పాఠశాల కేటగిరీ	సంఖ్య	విద్యార్థులు
ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు	163	7,533
ఏపీఆర్‌జేసీ	17	1,335
జెడ్పీ పాఠశాలలు	31	1,225
కేజీబీవీ	19	701
ప్రైవేట్ పాఠశాలలు	21	726
ఎయిడెడ్ పాఠశాలలు	1	13
ఏకలవ్య పాఠశాలలు	7	422
ప్రభుత్వ పాఠశాలలు (ఇంగ్లిష్ మీడియం)	13	537
మొత్తం	272	12,492

మంచి మార్కులే లక్ష్యం



ఉపాధ్యాయుల సూచనల మేరకు చదువుతున్నాం. ఏరోజు చదివినవి ఆ రోజే పరీక్షలు రాసేస్తున్నాం. రోజూ అన్ని సబ్జెక్టులు రివిజన్ చేస్తున్నాం. ఉపాధ్యాయుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తూ చదువుతున్నాం. పదిలో మంచి మార్కులు సాధించడమే లక్ష్యంగా అభ్యసిస్తున్నాం.

– కోడా శ్రీహర్షిణి, విద్యార్థిని, జీటీడబ్ల్యూఏ బాలికల పాఠశాల-2, ముంచంగిపుట్టు

ఉత్తమ ఫలితాలకు చర్యలు



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులు చదువుతున్న తీరు తదితర అంశాలపై తరుచూ సమీక్షలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రత్యేక కౌన్సెలింగ్, అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక ప్లానింగ్‌తో విద్యార్థులపై దృష్టి సారిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ తీసుకుంటున్నాం.

– ఎం.వి.ఎస్.ప్రకాష్,హెచ్‌ఎం, జీటీడబ్ల్యూఏ బాలికల పాఠశాల-2, ముంచంగిపుట్టు

అంగన్‌వాడీ కేంద్రం భవన కోసం ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

గూడెంకొత్తవీధి: మండలంలోని దుప్పిలవాడ పంచాయతీలోని హరిపురం గ్రామంలో మినీ అంగన్‌వాడీ కేంద్రం భవనం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు ఐసీడీఎస్ పీఓ లక్ష్మీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'పాకలోనే అంగన్‌వాడీ కేంద్రం' శీర్షికతో 'సాక్షి'లో ఈనెల 9న ప్రచురితమైన వార్తకు ఐసీడీఎస్ పీవో లక్ష్మీదేవి స్పందించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతానికి అద్దె భవనంలోనే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కొత్త భవనం నిర్మాణం కోసం గతంలోనే రెవెన్యూ అధికారులను కోరగా వారు అయిదు సెంట్ల స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే మినీ అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతానికి అక్కడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సీడీపీవో తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: నలుగురికి గాయాలు



ప్రమాదం జరిగిన ప్రాంతంలో క్షతగాత్రులు

అడ్డతీగల: మండలంలోని వేటమామిడి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో నలుగురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ వినోద్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అడబాల రాజు అడ్డతీగల నుంచి బైక్‌పై వేటమామిడికి వెళ్తుండగా, వేటమామిడి నుంచి అడ్డతీగల వైపు బైక్‌పై వస్తున్న పుడిగి అఖిల్, మోటుకూరి నూకరాజు, మోటుకూరి లక్కీ ఢీకొన్నారు. వేగంగా ఎదురెదురుగా వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108లో అడ్డతీగల సీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వీరిలో అడబాల రాజు, పుడిగి అఖిల్‌ను మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి వైద్యులు రిఫర్ చేశారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ వినోద్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకొని, నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

గిరిజన చట్టాల జోలికొస్తే సహించేది లేదు

11, 12 తేదీల్లో మన్యం బంద్‌పై విస్తృత ప్రచారం



పెదబయలు అంబేడ్కర్ కూడలిలో నినాదాలు చేస్తున్న నాయకులు



ముంచంగిపుట్టులో మన్యం బంద్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జేఏసీ నేతలు



సుంకరమెట్టలో ప్రచారం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు



డుంబ్రిగుడలో విద్యార్థులచే పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న నాయకులు



పాడేరులో కరపత్రాలు విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



చింతపల్లిలో మాట్లాడతున్న ఎంపీపీ అనూషదేవి, జెడ్పీటీసీ బాలయ్య పడాల్



జర్రెలలో బంద్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

అరకులోయ టౌన్: గిరిజన చట్టాలను అవహేళన చేస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈనెల 11, 12 తేదీల్లో చేపడుతున్న మన్యం బంద్‌పై జిల్లా వ్యాప్తంగా అఖిలపక్షం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, జేఏసీ నాయకులు ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. బంద్‌కు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పార్టీల నాయకులు, విద్యావేత్తలు మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదివాసీలకు కల్పించిన హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. గిరిజన చట్టాలు, హక్కుల జోలికి వస్తే ఆదివాసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. గిరిజన హక్కులు, చట్టాలను హేళన చేస్తూ, టూరిజం అభివృద్ధి పేరుతో అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు గిరిజన జాతిని ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. స్పీకర్ స్థాయిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై ఆదివాసీలంతా తీవ్రంగా ఖండిస్తున్నారన్నారు. అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించి ప్రకటన విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయ్యన్న పాత్రుడు తన వాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. గిరిజన చట్టాలను నిర్వీర్యం కాకుండా చూడాలే తప్పా చట్టాలను కాలయారాలని ప్రయత్నిస్తే గిరిజన సమాజం ఊరుకోదని, దీనిపై తీవ్రంగా ప్రతిఘటిస్తున్నామన్నారు.

కూటమి ప్రభుత్వానికి, అయ్యన్నపాత్రుడుకు గిరిజనుల చట్టాల జోలికి వస్తే ఏం జరుగుతుందో గిరిజనులంతా తెలియజేయాలన్నారు. మన్యం బంద్‌కు అన్ని వర్గాలు ప్రజలు, ప్రజా సంఘాలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సుంకరమెట్ట వారపు సంతలో నిర్వహించిన ప్రచారంలో గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి , బీఎస్పీ మండల అధ్యక్షుడు మాదవరావు, వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్, జేఏసీ ప్రతినిధులు రామకృష్ణ, బాబూరావు, కొండపదాల్, మాలయ్య, కామేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఎల్‌వో కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం

పెదబయలు: మండల కేంద్రంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో నాయకులు శేషాద్రి, కొండబాబు, సన్ని బాబు, సింహాచలం, బాలకృష్ణ. పోతురాజు, మత్స్యరాజు, లోయితాస్.చిన్నయ్య గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సూర్యనారాయణ, పోతురాజు, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్: ఏజెన్సీ బంద్‌పై మండలంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రచార కార్యక్రమాల్లో గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ , ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కోరాబు అనూషదేవి, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్ , వైస్ ఎంపీపీలు శారద , వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో జరిగిన కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి కేంద్ర కమిటీ ప్రతినిధి(డిఎల్‌వో) సమిరెడ్డి మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకటేశ్వర్లు, రాజులుబాబు, కిరణ్, వాణిశ్రీ, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ డివిజన్ చైర్మన్ నరేష్, రాష్ట్ర కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కాక అర్జున్‌దొర తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలో జరిగిన కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ కోటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆవుల మరియాదాస్ తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలోని మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు



చింతూరులో బంద్ పోస్టర్లను విడుదల చేస్తున్న జేఏసీ నాయకులు



ఎటపాకలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆస్పత్రిలో చిన్నారులకు పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శిస్తున్న సురేంద్ర, తదితరులు

అరకులోయటౌన్: మండలంలోని శిరగాం పంచాయతీ కోడిపుంజువలస గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు విష జ్వరాలు తదితర రోగాలతో బాధపడుతూ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆదివారం ఆస్పత్రిని సందర్శించి, చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు స్పందించి గ్రామంలో రక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బారికి సుమలత(9), జన్ని శ్రేష్టిత(4), రాహుల్(5), కొర్రా రజని(10),మాదల జాన్‌పాల్(9), జన్ని హర్షణ(7)లకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. నాయకులు బుజ్జిబాబు, రామన్న, నాని బాబు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపాధ్యాయుడు శామ్యూల్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు గిరి తదితరులు

చింతపల్లి: మండల కేంద్రంలోని గిరిజన్ భవన్‌లో పీఆర్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఉగ్రంగి వెంకటగిరి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో సంఘం కీలకపాత్ర పోషించిందన్నారు. మహిళలకు ప్రత్యేక జీవోలు,నోషనల్ ఇంక్రిమెంట్లు తదితర జీవోలను సాధించడంలో ముఖ్యపాత్ర పోషించిందని, సుమారు ఐదు దశాబ్దాలుగా సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంత తొలితరం సీనియర్ ఉపాధ్యాయుడు వసపరి శామ్యూల్‌ను ఘనంగా సన్మానించారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.మత్స్యలింగం, మండల గౌరవ అధ్యక్షురాలు ఎస్.ఉత్తరకుమారి, ఉపాధ్యక్షుడు కె.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని పాడిగేదెలు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గేదె

అడ్డతీగల: మండలంలోని గౌరయ్యపేట గ్రామ సచివాలయం ఎదురుగా జాతీయ రహదారి 516ఇ–పై ఆదివారం రాత్రి కారు ఢీకొన్న ప్రమాదంలో రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. జాతీయ రహదారిపై అత్యంత వేగంగా వచ్చిన కారు గేదెలను ఢీ కొట్టడం వల్ల అవి సంఘటన స్థలంలోనే మృతి చెందినట్టు స్థానికులు చెప్పారు. తమ పాడి గేదెలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా గేదెలను ఢీ కొట్టిన కారు జాతీయ రహదారి పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బందికి చెందినట్టు పలువురు అనుమానిస్తున్నారు. ఈ సంఘటన గురించి పోలీసులు విచారించనున్నట్టు తెలిసింది.

నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ

చింతపల్లి/కొయ్యూరు: నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చింతపల్లి, కొయ్యూరు మండలాల్లో సోమవారం చేపడుతున్నట్టు ఎంపీడీవోలు శ్రీనివాసరావు, ప్రసాద్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు ఈ మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.